గ్రంథాలయ స్వీపర్ మృతి

బెల్లంపల్లి, జూన్ 27 :బెల్లంపల్లి శాఖ కాళోజీ గ్రంథాలయ స్వీపర్ నీలి రమేశ్ (57) గుండెపోటుతో మృతి చెందారు. గుండె సంబంధిత వ్యాధితో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున కన్నుమూశారు. బెల్లంపల్లి మండలం చాకెపల్లి గ్రామానికి చెందిన రమేశ్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతిపై పోటీ పరీక్షల అభ్యర్థులతో పాటు గ్రంథాలయ సిబ్బంది రెండు నిముషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. భౌతిక కాయం వద్ద రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్ నివాళులర్పించారు.

వారసంత వేలం

కెరమెరి, జూన్ 27: మండల కేంద్రంలో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంతకు వేలం పాటను గురువారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో, కెరమెరి జీపీ ప్రత్యేక అధికారి మహ్మద్ అమ్జద్ పాషా సమక్షంలో పంచాయతీ కార్యదర్శి భీమయ్య నిర్వహించారు. రూ.1,87500 పాడిన రాథోడ్ సాగర్‌కు దక్కింది.

దరఖాస్తుల ఆహ్వానం

చెన్నూర్ రూరల్, జూన్ 27: చెన్నూర్ మండలంలోని కిష్టంపేట డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి గురువారం తెలిపారు. కళాశాలలో ఇంగ్లిష్, తెలుగు, కంప్యూటర్, ఫిజిక్స్ బోధించేందుకు ఆసక్తి గల అభ్యర్థులు తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో ఈ నెల 29 వరకు కళాశాలలో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

జన్నారం, జూన్ 27 :మండలం కేంద్రంలో పొనకల్ పంచాయతీ పరిధిలోని ఈద్గా వద్ద సమీపంలో పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ కుందారపు రఘు(27) మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దండేపల్లి మండలం తాళ్లపేటకు చెందిన కుందారపు రఘు అనారోగ్య సమస్యలతో మనస్తాపం చెంది ఈ నెల 25న పొనకల్‌లో ఈద్గా వద్ద పురుగుల మందుతాగాడు. అతడిని కరీంనగర్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి తండ్రి కుందారపు చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజవర్ధన్ తెలిపారు.

పిడుగు పడి ఎద్దు మృతి

కాసిపేట, జూన్ 27 : కాసిపేట మండలంలోని వరిపేట శివారులో బుధవారం రాత్రి పిడుగు పడి బుగ్గగూడకు చెందిన ఏదుల మల్లేశ్ గిరిజన రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. ఈ మేరకు పశు వైద్యాధికారి కుర్మ తిరుపతి మృతి చెందిన ఎద్దును పరిశీలించి పంచనామా నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

దహెగాం,జూన్27: మండలంలోని చంద్రపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని పీకలగుండం గ్రామానికి చెందిన దుర్గం పురుషోత్తంకు చెందిన గేదె గురువారం ఉదయం విద్యుత్ షాక్ గురై మృతి చెందింది. బుధవారం రాత్రి వచ్చిన గాలి వానకు విద్యుత్ వైరు తెగి రోడ్డుపై పడింది. మేతకు వెళ్లిన గేదెకు తగలడంతో అకడిక్కడే మృతి చెందినట్లు బాధిత రైతు పేర్కొన్నారు. గేదె విలువ సుమారు రూ 70 వేలు ఉంటుందని పేర్కొన్నారు.

కోటపల్లి ఎంపీవోగా సత్యనారాయణ

కోటపల్లి, జూన్ 27 : కోటపల్లి మండల పంచాయతీ అధికారిగా ముల్కల్ల సత్యనారాయణ రెడ్డి గురువారం బాధ్యతలను స్వీకరించారు. డిప్యూటేషన్ పై తాండూర్ మండల ఎంపీవోగా పనిచేసిన సత్యనారాయణ డిప్యూటేషన్ రద్దు కావడంతో తిరిగి కోటపల్లికి వచ్చారు.

ముగ్గురిపై కేసు

నెన్నెల, జూన్ 27: మండలంలోని మన్నెగూడెంలో భూ పంపకాల విషయంలో జరిగిన తగాదాలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. భూ పంపకాల విషయంలో తలెత్తిన గొడవలో పోగుల శ్రీనివాస్, మల్లేశ్ ఇంటిలో పడుకొని ఉండగా అదే గ్రామానికి చెందిన పోగుల అమ్మక్క, విక్రమ్, హరీశ్ వచ్చిభూమి విషయంలో వారితో గొడవకు దిగి కర్రలతో దాడి చేసి గాయపర్చారని తెలిపారు. శ్రీనివాస్ భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ జూన్ 27: పట్టణంలోని అంబేద్కర్ చౌక్ వద్ద సీఐ సతీశ్ ఆధ్వర్యంలో ఎస్సైలు ప్రవీణ్, రాజేశ్వర్, సిబ్బంది వాహనాల తనిఖీలు నిర్వహించారు.

మున్సిపల్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్
- నస్పూర్ మున్సిపాలిటీలో పర్యటన

సీసీసీ నస్పూర్, జూన్ 27: నస్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సమష్టిగా కృషిచేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. గురువారం నస్పూర్ మున్సిపాలిటీలో ఆయన పర్యటించారు. ముందుగా మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి, కమిషనర్ చిట్యాల సతీశ్, చైర్మన్ సుర్కిళ్ల వేణుతో కలిసి ఆయన కార్యాలయంలోని వివిధ విభాగాలతో పాటు ప్రజాపాలన సేవా కేంద్రాన్ని పరిశీలించారు. సీసీసీలోని డంప్ యార్డును సందర్శించారు. మున్సిపల్ పరిధిలోని ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి డంప్ యార్డుకు తరలించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని నర్సరీని సందర్శించి,

నస్పూర్‌లో నర్సరీని పరిశీలిస్తునన కలెక్టర్ కుమార్ దీపక్

మొక్కల వివరాలు తెలుసుకున్నారు. మొక్కలు నాటేందుకు నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా సిద్ధం చేయాలని ఆదేశించారు. వార్డుల్లో మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించడం, వీధి దీపాల నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాలన్నారు. మురుగు కాలువలలో పూడిక పనులు చేపట్టి శుభ్రంచేయాలని, పారిశుధ్య నిర్వహణలో భాగంగా డ్రై డే కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజాపాలన కార్యక్రమాన్ని సమర్థంతంగా నిర్వహించాలన్నారు.

ఫార్మసీ గదికి మరమ్మతులు చేయాలి

లక్షెట్టిపేట, జూన్ 27: లక్షెట్టిపేట ప్రభుత్వ హాస్పిటల్‌లోని ఫార్మసీ గదికి తక్షణమే మరమ్మతులు చేయాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానతో పాటు మున్సిపల్ కార్యాలయాన్ని కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ దవాఖాన బిల్డింగ్‌ను వేగంగా పూర్తి చేయాలని, హాస్పిటల్‌ను అక్కడికి మార్చాలని, అంతేగాకుండా ప్రస్తుత మున్న హాస్పిటల్ భవనంలోకి పురపాలక కార్యాలయాన్ని మార్చాలని, పాత కార్యాలయాన్ని హాస్పిటల్‌కు అప్పగించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నలుమాసు కాంతయ్య, సూపరింటెండెంట్ డాక్టర్ ఆకుల శ్రీనివాస్, తహసీల్దార్ రాఘవేంద్రరావు, మున్సిపల్ కమిషనర్ కల్లెడ రాజశేఖర్, వైద్యులు సురేశ్, రవళి, పవిత్ర, కౌన్సిలర్లు ఉన్నారు.

నాణ్యమైన విద్యనందించాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పీ హరీశ్ బాబు

పెంచికల్ పేట్, జూన్ 27 : విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించాలని సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.26తో మంజూరైన అదనపు గదుల నిర్మాణానికి ఉపాధ్యాయులు, మండల నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. కేంద్ర ప్రభుత్వం నిధులతో తాలుకాలో పలు పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులను ప్రారంభించామని త్వరగా పూర్తిచేసి అందుబాటులో తీసుకురావాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుకర్ నాయకులు సత్యనారాయణ, గణపురం నగేశ్, భీమయ్య, వెంకటి, పురుషోత్తం, కాంతారావు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు గదులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్ బాబు

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయద్దు : డీపీవో

హాజీపూర్, జూన్ 27 : పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయవద్దని డీపీవో వెంకటేశ్వర్ రావు ఆదేశించారు. మండలంలోని దొనబండలో డీపీవో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను, గ్రామ శివారులో ఏర్పాటు చేసిన నర్సరీలో మొక్కల పెంపకం, వాటి రక్షణకు తీసుకుంటున్న చర్యల, వర్మి కంపోస్టు షెడ్‌లను పరిశీలించి పంచాయతీ కార్యదర్శిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జీపీ కార్యాలయంలోని రికార్డులను పరిశీలించారు. నీటి నిల్వ లేకుండా చూడాలని తాగునీటి పైప్ లైన్లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తూ ప్రజలకు తాగునీరు సక్రమంగా అందేలా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. డీపీవో వెంట ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, కారోబార్ రాజేశ్ ఉన్నారు.

మాత, శిశు సంరక్షణ వివరాలను నమోదు చేయాలి

మందమర్రి రూరల్,జూన్27: మందమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం జిల్లా మాతా శిశు ఆరోగ్య సంరక్షణ అధికారి డా.నీరజ మందమర్రి దీపక్ నగర్ ఏఎన్‌ఎంలకు సూపర్ వైజర్లకు మాతా శిశు సంరక్షణ వివరాలను డిజిటల్ యాప్‌లో సరైన విధానంలో ఎంట్రీలు చేయాలని సూచించారు. జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించాల్సిన కార్యక్రమాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రమేశ్, మానస, సీహెచ్‌వో కే గంగాధర్, హెల్త్ సూపర్ వైసర్ విజయ, ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్స్ రేవతి, ఫార్మసిస్ట్ ప్రవంతి, ఏఎన్ ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేదల గుడిసెలు కూల్చివేత

- కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి
- బీఆర్ఎస్, సీపీఎం నాయకుల డిమాండ్

చెన్నూర్ రూరల్, జూన్ 27: చెన్నూర్ మండలంలోని బావురావుపేట శివారులో గత రెండేళ్ల నుంచి ప్రభుత్వ భూమిలో చెన్నూర్ పరిసర ప్రాంతాల దళితులు, నిరుపేద కుటుంబాలు వేసుకున్న గుడిసెలను గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి జేసీబీతో కూల్చివేశారని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, దళితులు తెలిపారు. ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా పట్టాలు చేసుకొని, గుడిసెలను కూల్చివేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో భూ కబ్జాదారులను ప్రోత్సహిస్తున్నదని ఆరోపించారు. గుడిసెలు కూల్చి వేసిన వారిని శిక్షించాలని కోరారు.

గుర్తు తెలియని దండగులు కూల్చిన దళితుల గుడిసెలు

నిరుపేదల గుడిసెలను తొలగించటం అన్యాయం

చెన్నూర్, జూన్ 27: ప్రభుత్వ భూమిలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలను కొందరు వ్యక్తులు తొలగించటం అన్యాయమని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇన్‌చార్జి, మున్సిపాలిటీ కౌన్సిలర్ రేవెల్లి మహేశ్ అన్నారు. చెన్నూర్‌లో ఆయన గురువారం మాట్లాడుతూ బావురావుపేట శివారులోని సర్వే నంబర్ 8లో గుడిసెలను వందల మందితో వచ్చి నిరుపేదలపై దాడి చేసి తొలగించారని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వివేక్ తాను గెలిస్తే వారు వేసుకున్న గుడిసెల స్థానంలో పక్కా ఇండ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. కానీ ఇప్పుడు ఉన్న గుడిసెలను తొలగించారని ఆయన ఆరోపించారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే వివేక్ స్పందించి కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అకుదారి సమ్మయ్య, తిరుపతి సురేశ్, రేవెల్లి రాజశేఖర్, సతీష్, మదునయ్య పాల్గొన్నారు.

చెన్నూర్ : మాట్లాడుతున్న కౌన్సిలర్ మహేశ్

భూకబ్జా ఫిర్యాదులపై సర్వే

మంచిర్యాలటౌన్, జూన్ 27: మంచిర్యాల పట్టణంలో 422 సర్వేనంబర్‌లో ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైందని పలు ప్రజాసంఘాలు ఇచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు సర్వే చేశారు. 92, 93 సర్వే నంబర్లలోని భూమి తమదేని కబ్జాపై ఉన్న వ్యక్తులు వాదిస్తున్నారు. దీంతో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ డిప్యూటీ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఉన్నతాధికారులు, స్థానిక అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి జాఫర్ నగర్, మార్క్స్ భవన్, ఆర్టీసీ డిపో, రాంచెరువు వరకు సర్వే కొనసాగింది. పూర్తి సర్వే రిపోర్టును కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు.

జాఫర్ నగర్ ప్రాంతంలో సర్వే చేస్తున్న అధికారులు

ఈ సర్వేలో సర్వేయర్ సంధ్య, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ రమాకాంత్, ఏడీ శ్రీనివాస్, మండల సర్వేయర్ ప్రసాద్, ఆర్ఐ అజీజ్, తదితరులు పాల్గొన్నారు.

నానో ఎరువులతో అధిక దిగుబడి

కాగజ్‌నగర్, జూన్ 27: ఇఫ్కో నానో ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని ఏడీఏ మనోహర్ రైతులకు సూచించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు. నానో ఎరువులు అన్ని పంటలకు అనుకూలంగా, సురక్షితంగా ఎలాంటి ప్రమాదకరం కాదని సూచించారు. ఇఫ్కో మేనేజర్ బాల వికాస్ మాట్లాడుతూ ఇక నుంచి కేంద్ర ప్రభుత్వం ప్రతి సొసైటీ నుంచి రైతులకు నానో యూరియా, డీఏపీ పంపిణీ చేస్తుందని తెలిపారు. ఏపో రామకృష్ణ మాట్లాడుతూ నానో ఎరువులతో భూసారం దెబ్బతినదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు సృజన, రోహిణి, శైలేశ్, సీఈవో సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ దిష్టిబొమ్మ దహనం

కాగజ్‌నగర్, జూన్ 27: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుల సస్పెన్షన్ నిరసిస్తూ కాగజ్‌నగర్ పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, కార్యదర్శి సాయికృష్ణ మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలకు తొత్తుగా హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్ వ్యవహరిస్తున్నారని, సమస్యలపై ప్రశ్నించినందుకు సస్పెన్షన్, జరిమానాలు విధించడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు తుమ్మిడే భీమేశ్, సహాయ కార్యదర్శి నితీశ్ పాల్గొన్నారు.

ఓరియంట్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మహేంద్రప్రతాప్ జోషి

కాసిపేట, జూన్ 27 : కాసిపేట మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో మంచిర్యాల శ్రీరామ పిల్లల దవాఖాన సహకారంతో ఉచిత పిల్లల వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఓరియంట్ కంపెనీ యునిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి, హెచ్ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి ప్రారంభించారు. 63 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఓరియంట్ కంపెనీ యునిట్ హెడ్ మహేంద్ర ప్రతాప్ జోషి, హెచ్ఆర్ జీఎం ఆనంద్ కులకర్ణి మాట్లాడుతూ ఓరియంట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ పిల్లల దవాఖాన డాక్టర్ రాజేశ్, ఓరియంట్ డాక్టర్స్ నవీన్, డాక్టర్ వంశీ, డాక్టర్ ఝాన్సీ, డాక్టర్ సాయి ప్రకాశ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం

నస్పూర్/మంచిర్యాల అర్బన్, జూన్ 27 : మంచిర్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా వచ్చిన కుమార్ దీపక్‌ను గురువారం వనితా వాక్కు ఫౌండేషన్ సభ్యులు మర్యాద పూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించారు. జిల్లాలో మత్తు పదార్థాల వినియోగాన్ని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రంగు వేణుకుమార్, జ్యోత్స్నచంద్రదత్, కవిత, సునీత, పద్మ, అనిత, జ్యోతి, దేవిక, మంగళ, వాసవీ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఎన్ఎంకు సన్మానం

దండేపల్లి, జూన్27: మండలంలోని మాదాపూర్ ఆరోగ్య ఉపకేంద్రంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహించి ఉద్యోగోన్నతిపై ములుగు జిల్లా గోవిందరావుపేట పీహెచ్‌సీకి వెళుతున్న శ్యామలను స్థానిక ఆరోగ్య ఉపకేంద్రంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కొంగల నవీన్‌కుమార్, మాజీ ఎంపీటీసీ చొప్పదండి రమేశ్, జీపీ కార్యదర్శి శ్రావణ్‌కుమార్, నాయకులు సీపతి మల్లయ్య, గంధె శ్రీనివాస్, పిట్టల రాజన్న, వినయ్, సన్ని, సతీశ్, సూపర్‌వైజర్ ముత్తమ్మ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

థియేటర్ల వద్ద 'కల్కి' అభిమానుల సందడి

కాగజ్‌నగర్,జూన్ 27: రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందించిన కల్కి2898AD సినిమా విడుదలైంది. ఈ సందర్భంగా గురువారం కాగజ్‌నగర్ మండల కేంద్రం వెంకటరమణ థియేటర్ వద్ద పటాకలు కాల్చి ప్రభాస్ అభిమానులు సంబురాలు నిర్వహించారు.

అటవీ ప్రాంతంలో చుక్కల దుప్పి మృతి

కాగజ్‌నగర్, జూన్ 27: కాగజ్‌నగర్ పట్టణంలోని సార్సాల అటవీ ప్రాంతంలో చుక్కలదుప్పి గురువారం మృతి చెందింది. ఇటీవల కుక్కలు దాడిలో గాయపడ్డ దుప్పిని గ్రామస్తులు కాపాడి అటవీ శాఖ అధికారులకు అప్పగించగా చికిత్స అందించి అడవిలోకి వదిలేశారు. గురువారం దుప్పి కళేబరం కనిపించడంతో అధికారులకు సమాచారం అందించారు. దుప్పి మృతిపై విచారణ చేపడుతున్నామని ఎఫ్ఆర్‌వో రమాదేవి తెలిపారు.

గుట్కా పట్టివేత

కాగజ్‌నగర్, జూన్ 27: కాగజ్‌నగర్‌కు చెందిన వ్యాపారి సంజయ్ కుమార్ అసావా గోదాములో గుట్కా ప్యాకెట్లు పట్టుకున్నట్లు పట్టణ సీఐ శంకరయ్య గురువారం తెలిపారు. దుర్గానగర్‌లోని గోదాముపై బుధవారం రాత్రి దాడి చేసి రూ. 2,56850 విలువైన నిషేధిత గుట్కా, పొగాకు పట్టుకున్నట్లు తెలిపారు. సంజయ్ కుమార్ అసావాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పెంచికల్‌పేట, జూన్ 27 : మండలంలోని బొంబాయి గూడ,మోట్లగూడ గ్రామంలో గురువారం కిరాణా దుకాణాల్లో సోదాలు నిర్వహించి 4500 విలువగల నిషేధిత గుట్కా పట్టుకున్నట్లు ఎస్ఐ కొమురయ్య తెలిపారు.బొంబాయి గూడకు చెందిన పాగిడే రఘునాథ్, మోట్లగూడకు చెందిన చౌదరి రాజన్న, పంకజ్ రాయ్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బోరు మోటర్ల చోరీ

చింతలమానేపల్లి, జూన్ 27 : మండలంలోని రణవెల్లి గ్రామ శివారులోని పంట పొలాల్లో ఉన్న రెండు 5 హెచ్‌పీ మోటర్లు బుధవారం చోరీకి గురయ్యాయి. గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి సమయంలో రెండు 5హెచ్‌పీ మోటర్లతో పాటు కరెంటు వైర్లను ఎత్తుకెళ్లినట్లు బాధితులు చల్లూరి హోక్టు, టుస్టే పోశన్న తెలిపారు. గతంలోనూ 3 మోటర్లు ఎత్తుకెళ్లారని, ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చింతలమానేపల్లి, జూన్ 27 : మండలంలోని డబ్బా–దరంపల్లి వాగులో ఇసుక అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న మూడు ట్రాక్టర్లను ఎస్ఐ నరేశ్ పట్టుకున్నారు. ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి విశ్వజిత్ మండల్,సోనురై, వినోద్, దండి వెంకటేశ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బెల్లం పట్టివేత

చింతలమానేపల్లి, జూన్ 27 : జిల్లా ప్రొహిబీషన్, ఎక్సైజ్ అధికారి బీ.జ్యోతి కిరణ్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ ఎక్సైజ్ అధికారులు చింతలమానేపల్లి మండలంలోని లంబడిహెట్టి గ్రామంలో నాటు సారా తయారీదారులకు బెల్లం రవాణా చేస్తున్న టాటాఏస్ వాహనంతో పాటు 760 కిలోల బెల్లం, 70కిలో పటికను పట్టుకున్నట్లు తెలిపారు. లంబడిహెట్టికి చెందిన జర్పుల శ్యామ్‌లాల్‌పై కేసు నమోదు చేసినట్లు కాగజ్‌నగర్ ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

బెల్లంపల్లి, జూన్ 27 : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆవుల అంజయ్య అన్నారు. గురువారం ఇంటర్ విద్యార్థులకు ఆయన ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, బోఏ, ఎంపీహెచ్‌డబ్ల్యూ, సీఎస్, ఎంఎల్‌టీ గ్రూపులు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీ బాబురావు, లైబ్రేరియన్ నరేంద్రకుమార్, లెక్చరర్లు కృష్ణవేణి, లక్ష్మణ్, సదయ్య, సోమయ్య, చంద్రయ్య, గురుపాదం, విమల్‌కుమార్, రాజేశ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించాలి

తాండూర్, జూన్ 27 : ప్రభుత్వ బడులలోనే తమ పిల్లలను చేర్పిస్తూ ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేయాలని ప్రైవేటు పాఠశాల ప్రలోభాలకు లొంగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల నుంచి తీసుకెళ్లడం సరికాదని ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీటీసీ సూరం రవీందర్ రెడ్డి అన్నారు. మండలంలోని మాదారం త్రీ ఇంక్లైన్ ప్రాథమికోన్నత పాఠశాల 1 నుంచి 7వ తరగతి వరకు మొత్తం 56 మంది విద్యార్థులు, హెచ్ఎం, ముగ్గురు ఎస్‌జీటీ ఉపాధ్యాయులున్నారు. 2,3,4 తరగతుల నుంచి విద్యార్థులు 10 మంది ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లేందుకు టీసీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో ఎంపీడీవో, ఎంపీటీసీ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాల సిబ్బందితో మాట్లాడి సరి చేసి విద్యార్థులు చదువులో రాణించేలా చర్యలు చేపడతామని, ఇందులోనే చదివించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం విద్యాసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ

మందమరి రూరల్, జూన్ 27: మందమరి పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల(ఒరిగడ్డ)లో గురువారం ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో 125 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి హాజరై సొసైటీ సభ్యులను అభినందించారు. సొసైటీ అధ్యక్షుడు షేక్ అజీమోద్దీన్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు పోత్సాహం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సుద్దాల ప్రభుదేవ్, పట్టణ అధ్యక్షుడు నందిపాట రాజ్, కార్యదర్శి గాండ్ల సంజీవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజ, సుధాకర్, సభ్యులు ఎండీ జావిద్ పాషా, సుందర్, అజయ్, లోబో చింటు, గణేశ్, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై శిక్షణ

కౌటాల, జూన్ 27 : మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు నూతన జాతీయ విద్యా విధానంపై సిర్పూర్ ప్రాజెక్టు సీడీపీవో విజయ లక్ష్మి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్లు సూపర్‌వైజర్లు షాకీర బేగం, కరుణ, సూపర్‌వైజర్లు పద్మ, శంకరమ్మ, షనీనా బేగం, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు..

మాజీ సర్పంచ్‌కు అభినందన

జన్నారం, జూన్ 27 : మండలంలోని మురిమడుగు గ్రామ పంచాయతీ 2023వ సంవత్సరానికి గాను ఉత్తమ రోల్ మోడల్ అవార్డును పొందినందుకు గాను గురువారం గ్రామ పంచాయతీ ఆవరణలో మాజీ సర్పంచ్ ఇందన్‌పెల్లి భాగ్యలక్ష్మిని, ఎంపీవో రమేశ్‌ను గ్రామస్తులు శాలువా కప్పి సన్మానించారు. అనంతరం అక్కడ డాక్టర్ ఉమశ్రీ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం నిర్వహించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

తాండూర్, జూన్ 27 : మండల కేంద్రంలోని జడీహెచ్ఎస్ పాఠశాల వెనుక వైపు నుంచి మసీదు వరకు రూ.5 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ఎంపీటీసీ సి